సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 2 । జూలై । 2024



అయినా వారే 'కీ'లకం

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అవినీతిపై ఫిర్యాదులు వెల్లువెత్తినా పట్టించుకోకపోవడంలో మర్మమేమిటో అంతు పట్టడం లేదు. 8లో▸



నలుగురు బైండోవర్

వెంచర్‌లో పూజలు చేసి, వండుకోవడానికి వెళ్లిన వారిని బైండోవర్ చేసిన సంఘటన మోకిల ఠాణా పరిధిలో జరిగింది. 8లో▸



నూతన కమిటీ నియామకం

శ్రీవాణి సాంస్కృతిక సంస్థ నూతన కమిటీని సోమవారం షాద్‌నగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

'ప్రజావాణి' అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు

కలెక్టర్ శశాంక



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే పరిష్కారం అయ్యేలా చూడాలని కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల వద్ద కలెక్టర్ శశాంక అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌ఓ సంగీతతో కలిసి అర్జీలు స్వీకరించారు. మొత్తం 70 ఫిర్యాదులు అందినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందిస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

పులి సంచరిస్తోందంటూ వదంతులు



గ్రామస్తులు గుర్తించిన జంతువు పాదముద్ర

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో పులి సంచరిస్తోందంటూ వదంతులు మొదలయ్యాయి. గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల్లో సోమవారం ఉదయం గుర్తు తెలియని జంతువులకు సంబంధించిన కాలి ముద్రలను గ్రామస్తులు గుర్తించారు. అవి పులి కాలి ముద్రలా, లేక హైనాకు సంబంధించినవా అనే అనుమానాలు ఉన్నాయి. విషయం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో లింగారెడ్డిగూడ గ్రామస్తులతో పాటు, చుట్టు పక్కల గ్రామాల ప్రజల భయాందోళనలకు గురవుతున్నారు.

అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలి

రాష్ట్ర సహకార సంఘం మాజీ చైర్మన్ రాజావరప్రసాద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజావరప్రసాద్

షాద్‌నగర్: డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని రాష్ట్ర సహకార సంఘం మాజీ చైర్మన్ రాజావరప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని దేవి గ్రాండ్ హోటల్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో షాద్‌నగర్‌లో 1,700 డబుల్ బెడ్రూం ఇళ్లను కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించడం జరిగిందని అన్నారు. అర్హులైన నిరుపేదల జాబితాను గతంలోనే అధికారులు రూపొందించారని తెలిపారు. ఇళ్ల కేటాయింపులో గతంలో ఎమ్మెల్యే కానీ ఇతర ప్రజాప్రతినిధులెవరూ జోక్యం చేసుకోలేదన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద అన్ని మౌలిక సదుపాయాల కల్పన పూర్తి చేసినట్లు చెప్పారు. అయినా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేయకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. నిరుపేదలు చాలా మంది అద్దె ఇళ్లలో ఉంటూ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్లను పంపిణీ చేయకపోవడంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పేదలకు వాటిని పంపిణీ చేయాలని లేని పక్షంలో ఈనెల 6న ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు.

స్పీకర్, మంత్రిని కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే

చేవెళ్ల: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్‌బాబును చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లోని వారి నివాసంలో సోమవారం వేర్వేరుగా కలిశారు. ఇటీవలే ఆయన బీఆర్‌ఎస్‌పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే.

'భరోసా' ఎంతకో?

ఐదెకరాలకా? పదెకరాలకా..?

- రైతుభరోసా పథకంపై అభిప్రాయ సేకరణ
- రెండు రోజులుగా మండలాలు, గ్రామాల వారీగా సమావేశాలు
- ఐదెకరాలకే పరిమితం చేయాలని మెజార్టీ రైతుల అభిప్రాయం
- సాగు భూములకే ఇవ్వాలని తీర్మానాలు
- ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రైతుభరోసా పథకాన్ని ఐదెకరాలకు వర్తింప జేస్తారా? లేక పదెకరాలకా అనే అంశంపై సర్వత్రా సందిగ్ధత నెల కొంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాగు భూములతో పాటు సాగుకు యోగ్యంగా లేని భూములకు సైతం రైతుబంధు పథకాన్ని వర్తింపజేసింది. కేవలం పంట సాగు చేసే రైతులకే కాకుండా ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్‌ఆర్‌ఐలు, పన్ను చెల్లింపుదారులకు కూడా అవకాశం కల్పించింది. ఈ విధానానికి స్వస్తి పలకాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావించింది. ఆ మేరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, వ్యవసాయశాఖల సంయుక్త ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో సర్వేకు ఆదేశించింది. అధికారులు రెండు రోజుల నుంచి గ్రామాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి, రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. మెజార్టీ రైతులు ఈ పథకాన్ని సాగు భూములకే వర్తింపజేయాలని అభిప్రాయపడుతున్నారు. మరికొంత మంది ఐదెకరాలలోపు ఉన్న సాగు భూములకే వర్తింపజేయాలని కోరగా, ఇంకొందరు పదెకరాల వరకు వర్తింపజేయాలని సూచించారు. మరికొందరు సాగు రైతులకే ఈ పథకాన్ని వర్తింపజేయాలని కోరుతున్నట్లు తెలిసింది. కొందరైతే ఈ పథకమే సరి కాదనే అభిప్రాయం వ్యక్తం చేస్తుండటం విశేషం.

సాగులేని భూములకు నగదు జమ

జిల్లాలో 12,43,035 ఎకరాల సాగు భూములు ఉన్నాయి. వీటిలో 8,86,705 ఎకరాలు సాగుకు యోగ్యంగా ఉన్నాయి. ప్రస్తుతం 4,48,218 ఎకరాల్లో పంటలు పండుతున్నాయి. మిగిలిన భూములన్నీ రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోయాయి. ఫాం లాండ్స్, విల్లాలు, బహుళ అంతస్తుల నిర్మాణాలు వెలిశాయి. నిజానికి గండిపేట, రాజేంద్రనగర్, హయత్‌నగర్, బాలాపూర్ మండలాల్లో 99 శాతం వ్యవసాయేతర భూములుగా మారాయి. రియల్ ఎస్టేట్ వెంచర్లు, నిర్మాణాలు వెలిశాయి. రైతుల పేరుతో రియల్టర్లు పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవడం, ప్రభుత్వం ఇదేదీ పట్టించుకోకుండా 2023 వానాకాలంలో 3,22,010 మంది రైతుల ఖాతాల్లో రూ. 345.36 కోట్లు జమ చేయగా, 2023–24 యాసంగిలో 4,04,429 మంది రైతుల ఖాతాల్లో రూ.378.92 కోట్లు జమ చేసింది.

ప్రభుత్వ ధనం 'ప్రైవేటు' పరం

గండిపేట మండలంలో 2,069 మంది రైతుల ఖాతాల్లో రూ.11.61 లక్షలు జమ చేయగా, రాజేంద్రనగర్ మండలంలో 278 మంది ఖాతాల్లో రూ.17.15 లక్షలు, శంషాబాద్‌లో 13,908 మంది ఖాతాల్లో రూ.1.08 కోట్లు, హయత్‌నగర్‌లో 236 మంది ఖాతాల్లో రూ.17.49 లక్షలు, బాలాపూర్‌లో 3,177మంది రైతుల ఖాతాల్లో రూ.25.28 లక్షల చొప్పున జమ చేశారు. నిజానికి ఆయా మండలాల్లో పంటల సాగు మచ్చుకు కూడా కన్పించదు. పూర్తిగా రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోయాయి. నిర్మాణాలు కూడా వెలిశాయి. అధికారులు గుడ్డిగా ఆయా ఖాతాల్లో నగదు జమ చేయడం విశేషం. ఇలా ఆరేళ్లలో కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం ప్రైవేటు రియల్ ఎస్టేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లింది. అంతేకాదు రైతుబంధు సామూహిక బీమా పథకం కింద ఆయా మండలాల్లోనూ డెత్ క్లెయిమ్స్ చేసుకోవడం గమనార్హం. పంట రుణాల పేరుతో బ్యాంకుల నుంచి లోన్లు తీసుకున్న వ్యాపారుల అప్పులను కూడా ప్రభుత్వం తీర్చాల్సి వస్తుండటం విశేషం.



చేవెళ్ల: సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

అభిప్రాయం చెప్పండి

చేవెళ్ల: ప్రభుత్వం అమలు చేయనున్న రైతుభరోసా పథకంపై రైతులు అభిప్రాయాలు తెలపాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు.మండలంలోని గుండాల పీఏసీఎస్ పరిధిలోని రైతులతో సోమవారం చైర్మన్ నక్క బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేసే పథకంపై రైతుల నుంచి అభిప్రాయాలు కోరుతోందని.. అందులో భాగంగానే మండలాల వారీగా రైతులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుండాల పీఏసీఎస్ పరిధిలోని గ్రామాల రైతులు వారి అభిప్రాయాలు తెలియజేశారని వీటిని ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారు. సమావేశంలో ఏడీఏ రమాదేవి, ఏఓ తులసీ, ఏఈఓ స్వాతిప్రియ, సొసైటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

షాబాద్ రైతు వేదికలో..

షాబాద్: రైతుభరోసా పథకంపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం రైతుభరోసా పథకంపై రైతులతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో 46 మంది రైతులు సమావేశానికి హాజరుకాగా వారి నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సత్యనారాయణరెడ్డి, ఏడీఏ రమాదేవి, ఏఓ వెంకటేశం, పీఏసీఎస్ చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మద్దూరి మల్లేష్, సీఈఓ శివకుమార్‌రెడ్డి, ఏఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగు చేసే భూములకే ఇవ్వాలి



సాగు చేసే భూములకే రైతు భరోసా అందించాలి. బీడు భూములకు ఇవ్వకూడదు. పంటలు సాగు చేసే సమయంలో ఇస్తే బాగుంటుంది. డబ్బులు లేకపోతే వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. త్వరగా అమలు చేస్తే సంతోషిస్తాం.

– చంద్రయ్య, రైతు, అంతారం, షాబాద్ మండలం

ఆరు నెలలకోసారి అందించాలి



ఆరు నెలలకు ఒకసారి రైతులకు పంటల సాగు చేసే సమయంలో రైతు భరోసా అందించాలి.కౌలు రైతులకు కూడా అందేవిధంగా చూడాలి. సన్న, చిన్నకారు రైతులకు భరోసా ఇచ్చి ఆదుకోవాలి. ఐదు నుంచి పది ఎకరాల వరకు ఇస్తే బాగుంటుంది.

– క్యామ జంగయ్య, రైతు, కుమ్మరిగూడ, షాబాద్ మండలం

సిద్ధాపూర్ భూములపై విచారణ జరిపించండి

మంత్రి పొంగులేటికి ఎమ్మెల్యే వీర్లపల్లి వినతి

కొత్తూరు: సిద్ధాపూర్ శివారులో టీజీఐఐసీకి కేటాయించిన భూముల పరిహారం విషయంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిశారు. గత ప్రభుత్వ హయాంలో సిద్ధాపూర్ శివారులో ఉన్న సుమారు 330 ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ స్థలాలను సేకరించి పరిశ్రమల ఏర్పాటుకు టీజీఐఐసీకి అప్పగించారు. అసైన్డ్ భూముల పరిహారం విషయంలో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలని మంత్రిని కోరారు. పేదల ఇళ్ల స్థలాలు, స్టేడియం నిర్మాణానికి కేటాయించాలని విన్నవించారు. దీంతో స్పందించిన మంత్రి కలెక్టర్ శశాంకతో ఫోన్లో మాట్లాడి సిద్ధాపూర్ భూముల వ్యవహారంలో విచారణ జరిపించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

మెట్రోకు 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' సర్టిఫికెట్



మెమెంటో అందజేత

సాక్షి, సిటీబ్యూరో: ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థకు మధ్య స్థాయి సంస్థల కేటగిరీలో 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' సర్టిఫికెట్ లభించింది. అత్యుత్తమ పని సంస్కృతిని ప్రోత్సహించే సంస్థలకు గ్రేట్ ప్లేస్ టు ఇండియా సంస్థ ప్రతి సంవత్సరం ఈ ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ గుర్తింపును ప్రకటిస్తుంది. 2024 జూన్ నుంచి 2025 జూన్ వరకు ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రోకు ఈ సర్టిఫికేషన్ లభించడం విశేషం. పని చేసే చోట ఉద్యోగులకు సానుకూలమైన, సాధికారికమైన పరిస్థితులను కల్పించడంలో ఎల్అండ్‌టీ మెట్రోకు గల నిబద్ధతకు ఈ గుర్తింపు నిదర్శనంగా నిలుస్తుంది. విశ్వసనీయత, గౌరవం, నూతన ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించే పరిస్థితులను కల్పించడంలో ఉద్యోగుల సంక్షేమం, వృద్ధి విషయంలో కంపెనీకి గల అంకిత భావానికి సముచితమైన గుర్తింపు లభించిందని అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే తొలి ప్రయత్నంలోనే ట్రస్ట్ ఇండెక్స్‌కి సంబంధించి అత్యధికంగా 92 స్కోరు పొందిన అతి కొద్ది సంస్థల్లో ఒకటిగా ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రో నిలిచింది. ఈ సందర్భంగా ఎల్అండ్‌టీ మెట్రోరైల్ ఎండీ అండ్ సీఈవో కేవీబీరెడ్డి మాట్లాడుతూ, ఈ గుర్తింపు లభించడం తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఉద్యోగుల కఠోర పరిశ్రమ, అంకితభావానికి ఈ సర్టిఫికేషన్ నిదర్శనమని పేర్కొన్నారు. పని ప్రదేశంలో పరిస్థితులను నిరంతరం మెరుగుపర్చేందుకు, ఉద్యోగుల ఎదుగుదల కోసం అత్యుత్తమమైన అవకాశాలను కల్పించడానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఉద్యోగులే అత్యంత విలువైన సంపద అని ఎల్అండ్‌టీ విశ్వసిస్తుందన్నారు. పరస్పర సహకారం, గుర్తింపు, వృత్తిగత అభివృద్ధికి దోహదపడే సంస్కృతిని పెంపొందిస్తున్నందుకుగాను ఎల్అండ్‌టీ సీహెచ్‌ఆర్‌వో బినో జోస్ మాథ్యూను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు.

4న తాగునీటి సరఫరాలో అంతరాయం



సాక్షి, సిటీబ్యూరో: మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే సింగూరు 3, 4 ఫేజ్‌లకు విద్యుత్ సరఫరా చేసే 132 కేవీ పెద్దాపూర్, కంది సబ్ స్టేషన్లలో మరమ్మతు పనుల నేపథ్యంలో ఈ నెల 4న గురువారం ఉదయం 7 గంటల నుంచి మరుసటి రోజు శుక్రవారం ఉదయం ఏడు గంటల వరకు పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని జలమండలి ఒక ప్రకటనలో తెలిపింది. 24 గంటల పాటు షేక్‌పేట్, జూబ్లీహిల్స్, సోమాజిగూడ, బోరబండ, మూసాపేట్, నల్లగండ్ల, చందానగర్, హుడా కాలనీ, హఫీజ్‌పేట్, మణికొండ, నార్సింగి, మంచిరేవుల, తెల్లాపూర్ తదితర ప్రాంతాల్లో పూర్తిగా అంతరాయం, భోజగుట్ట రిజర్వాయర్, బంజారా, ఎర్రగడ్డ, కేపీహెచ్‌బీ, హైదర్‌నగర్ తదితర ప్రాంతాల్లో లో–ప్రెజర్‌తో నీటి సరఫరా జరుగుతుందని పేర్కొంది. అంతరాయం ఏర్పడే ప్రాంతాల్లోని వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి సూచించింది.

తమిళనాడులో ఆర్టీఏ పౌరసేవలపై అధ్యయనం



సాక్షి, సిటీబ్యూరో: తమిళనాడు రవాణాశాఖ అందజేస్తున్న వివిధ రకాల పౌరసేవలను అధ్యయనం చేసేందుకు రంగారెడ్డి జిల్లా ఉపరవాణా కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ నేతృత్వంలోని అధికారుల బృందం చెన్నైకి వెళ్లింది. రవాణాశాఖ సేవలను మరింత మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్న రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు తెలంగాణ రవాణా అధికారుల బృందాలు కర్ణాటక, ఏపీ, ఒడిశా, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల పౌరసేవలపైన అధ్యయనం చేపట్టాయి. ఈ క్రమంలోనే సోమవారం డీటీసీ చంద్రశేఖర్‌గౌడ్ నేతృత్వంలో ఉప్పల్ ప్రాంతీయ రవాణా అధికారి వాణి, కామారెడ్డి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జింగ్లీ శ్రీనివాస్‌లు చెన్నై రవాణా కమిషనర్ కార్యాలయాన్ని సందర్శించారు. తమిళనాడు రవాణా శాఖ కమిషనర్ షణ్ముగ సుందరం, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమిళనాడులో అమలవుతున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్, వాహన్ పోర్టల్, కాలం చెల్లిన వాహనాల స్క్రాపింగ్ పాలసీ, పన్నుల విధానం, ఆదాయ మార్గాలు, చెక్ పోస్టుల పనితీరు, ఆన్‌లైన్ సర్వీసులు, తదితర అంశాలపైన ఆ రాష్ట్ర అధికారులతో చర్చించినట్లు చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ పౌరసేవల అమలు తీరుతెన్నులను పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. రెండు రోజుల పాటు తమ పర్యటన కొనసాగనున్నట్లు ఆయన వెల్లడించారు.

కురవని వాన..ఆశలు ఆవిరేనా

- కరుణించని వరుణుడు
- సమృద్ధిగా కురవని వర్షాలు
- మొలకెత్తని విత్తనాలు
- ప్రశ్నార్థకంగా మెట్ట పంటలు
- నిరాశలో రైతన్నలు

యాచారం: వరుణుడు కరుణించకపోవడంతో మెట్ట పంటల పరిస్థితి అయోమయంగా మారింది. వానాకాలం సీజన్ ప్రారంభమై నెలకావొస్తున్నా వర్షాలు సమృద్ధిగా లేవు. భారీ వర్షాలు కురిస్తే రోహిణి, మృగశిర కార్తెల్లో మెట్ట పంటలు సాగు చేస్తే మొక్కల్లో మంచి ఎదుగుదల, పూత, కాతతో గణనీయమైన దిగుబడి వస్తుందని రైతుల్లో నమ్మకం. కార్తెలు ముగిసినా సరైన వర్షాలు లేక ఆందోళనకు గురవుతున్నారు. పక్షం రోజుల క్రితం కురిసిన స్వల్ప వర్షానికి యాచారం, మంచాల, మాడ్గుల, కందుకూరు, తలకొండపల్లి, ఆమనగల్లు, కడ్తాల్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్ తదితర మండలాల్లో అదును పోతుందనే భయంతో రైతులు తడిపొడి భూమిలోనే మెట్ట పంటలు సాగు చేశారు. అప్పటి నుంచి ఆకాశంలో మబ్బులే తప్ప వరుణిడి జాడే లేకుండా పోయింది.

విత్తనాలు మొలకెత్తక..

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 2,95,661 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందుకు తగ్గట్టు ఆయా మండలాల్లోని వ్యాపారులు రూ.లక్షలాది పెట్టుబడులు పెట్టి ఎరువులు, విత్తనాలు నిల్వ చేసి ఉంచారు. కొందరు రైతులు తడిపొడి భూముల్లో విత్తనాలు విత్తడం కోసం రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టారు. విత్తిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో ఆందోళనలో పడ్డారు. కొంతమంది మళ్లీ దుక్కులు దున్ని వర్షాలు కురిస్తే విత్తనాలు విత్తుకోవడానికి సిద్ధమవుతున్నారు.

వానాకాలం సాగు అంచనా (ఎకరాల్లో)..

పంట	సాధారణ విస్తీర్ణం	సాగైంది
వరి	1,00,608	8,477
జొన్న	13,476	1,642
మొక్కజొన్న	68,549	7,455
కందులు	29,227	472
పచ్చిమిర్చి	203	5
చెరకు	45	5
పత్తి	1,77,735	58,470
ఇతర పంటలు	6,426	11,884

పత్తిపై సన్నగిల్లుతున్న ఆశలు

రైతుల్లో పత్తి సాగుపై రోజురోజుకూ ఆశలు సన్నగిల్లుతున్నాయి. రెండేళ్లుగా గణనీయమైన ధరలు ఉండడంతో మంచి లాభాలు గడించారు. అదే ఊపుతో ఈ ఏడాది సైతం సాగుకు సిద్ధమయ్యారు. వ్యవసాయ శాఖ కూడా ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 1, 77,735 ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేసింది. కానీ ఇప్పటివరకు 58,470 ఎకరాల్లో మాత్రమే సాగు పూర్తయింది. పత్తిపై ఆశతో రైతులు రూ.లక్షల్లో ఖర్చు చేసి బ్లాక్ మార్కెట్లో అదనపు ధర చెల్లించి విత్తనాలు కొనుగోలు చేశారు. కొందరైతే పంట ముడి పద్ధతిపై విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశారు. తడిపొడి భూమిలోనే విత్తనాలు విత్తడంతో ప్రస్తుతం మొలిచిన మొక్కలు ఎండిపోతున్నాయి.

వరి సాగు అనుమానమే..

జిల్లాలో అత్యధికంగా బోరుబావుల ద్వారానే వరి సాగవుతుంది. వర్షాలు సమృద్ధిగా కురిస్తే చెరువులు, కుంటలు నిండి బోరుబావుల్లో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది. రెండేళ్లుగా సరైన వర్షాలు లేక వేలాది బోరుబావులు వట్టిపోయాయి. మున్ముందు వర్షాలు కురస్తాయనే ఆశతో రైతులు రోహిణి, మృగశిర కార్తెల్లో నార్లు పోసి పెట్టుకున్నారు. వ్యవసాయ శాఖ కూడా వానాకాలం కింద జిల్లావ్యాప్తంగా లక్ష ఎకరాలకు పైగా వరి సాగయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. కానీ ఇప్పటివరకు 8,477 ఎకరాల్లో మాత్రమే సాగైంది. వర్షాలు కురిసి, భూగర్భజలాలు పెరగడం దేవుడెరుగు పోసిన వరి నార్లు ముదిరిపోయేలా ఉన్నాయి. కొద్ది పాటి నీళ్లున్న బోరుబావుల కింద 11,884 ఎకరాల్లో పలు రకాల కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తూ రైతులు జీవనోపాధి పొందుతున్నారు.



యాచారంలో పత్తి విత్తనాలు విత్తడం కోసం సిద్ధం చేసిన పొలం

వర్షాలు లేకపోతే అంతే..



20 ఎకరాల్లో పత్తి సాగుకు రూ.మూడున్నర లక్షలకు పైగా పెట్టుబడి పెట్టా. అదును పోతుందని బ్లాక్ మార్కెట్లో రూ.2,200 ఖర్చు చేసి విత్తనాల ప్యాకెట్లు కొనుగోలు చేశా. అదునులో విత్తనాలు విత్తితే దిగుబడి వస్తుందని ఆశపడ్డాం. వర్షాలు లేక విత్తనాలు భూమిలోనే ఉండిపోయాయి. రెండు, మూడు రోజుల్లో వర్షాలు లేకపోతే అంతే.

– కలకొండ బీరప్ప, రైతు నక్కర్తమేడిపల్లి

సిద్ధంగా విత్తనాలు, ఎరువులు



ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా లేక మెట్ట పంటల సాగు స్వల్పంగానే ఉంది. వర్షాలు కురిస్తే మరో 15 రోజుల వ్యవధిలో పత్తి సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికే వరి నార్లు పోసుకున్న రైతులు ఆగస్టు మొదటి వారంలో కూడా నాట్లేసుకోవచ్చు. సాగు విస్తీర్ణాన్ని బట్టి రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉంచాం.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

నలుగురు వ్యక్తుల బైండోవర్



వెంచర్‌లో వంట సామగ్రి

శంకర్‌పల్లి: ఓ వెంచర్‌లో పూజలు చేసి, వండుకోవడానికి వెళ్లిన వ్యక్తులను పోలీసులు బైండోవర్ చేశారు. ఈ సంఘటన మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి కొండకల్‌లోని అపర్ణ వెంచర్‌లో దర్గా ఉందని మోకిల తండా వాసులు కొందరు సోమవారం పూజలు చేశారు. అనంతరం దావత్ చేసుకోవడానికి సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న వెంచర్ యాజమానులు వారిని అడ్డుకుని, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పదుల సంఖ్యలో జనాలు ఉండటంతో మోకిల, బీడీయల్ ఠాణాల నుంచి వచ్చిన పోలీసులు.. నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం శంకర్‌పల్లి ఠాణాకు తరలించి, తహసీల్దార్ సురేందర్ ఎదుట బైండోవర్ చేశారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన పట్టణ శివారులోని కీర్తి వెంచర్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. వ్యక్తి(40) కాచిగూడ నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి శరీరంపై గులాబీ రంగు షర్టు, బ్లాక్ కలర్ ప్యాంటు, కుడి కాలుకు నల్లని ధారం ఉంది. వివరాలు తెలిసినా, ఆచూకీ లభించినా రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. లోకో పైలట్ లక్ష్మణ్‌దాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే కానిస్టేబుల్ తెలిపారు. ఇదిలా ఉండగా.. మృతుడి ముఖంపై బలమైన గాయాలు ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎవరైనా కత్తులతో పొడిచి హత్యచేసి రైలు పట్టాలపై పడేశారా? అని పలువురు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

అయినా వారే 'కీ'లకం

- ముస్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఇష్టారాజ్యం
- ఆరోపణలున్నా ప్రధాన బాధ్యతలు, ఉన్నతాధికారుల వత్తాసు
- బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీలో ఉద్యోగి చేతికే 'కీ'
- గతంలో కమిషనర్ డిజిటల్ కీ తో అనుమతులు జారీ చేసిన ఎంప్లాయి
- సమావేశంలో కౌన్సిలర్ల ఆగ్రహం



శంషాబాద్: ఆరోపణలు వెల్లువెత్తుతున్నా వారి చేతికే 'కీ'లక బాధ్యతలు. తప్పు మీద తప్పులు చేస్తున్నా వారినే వెనకేసుకొస్తూ 'కీ' ఇస్తున్న ఉన్నతోద్యోగులు. ముస్సిపాలిటీలో గత ఐదేళ్లలో కొందరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అవినీతిపై ఫిర్యాదులు వెల్లువెత్తినా పట్టించుకోకపోవడంలో మతలబు. మర్మమేమిటో ఎవరికీ అర్థం కావడం లేదు..

ఆటో రిక్షాతో వచ్చి..

ఐదేళ్ల క్రితం చెత్త ఆటో రిక్షాతో కాంట్రాక్టుతో ముస్సిపాలిటీలో ఎంట్రీ ఇచ్చిన ఓ వ్యక్తి ఆ తర్వాత ఉన్నతోద్యోగి పరిచయంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా మారాడు. కొంత కాలంగా జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో మున్సిపల్ కమిషనర్ డిజిటల్ 'కీ' సైతం తన దగ్గర పెట్టుకుని పత్రాలు జారీలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా జారీ చేసినట్లు ఇటీవల పై అధికారులు సైతం గుర్తించారు. అంతే కాకుండా ఒక్కో పత్రానికి రూ. 5 వేల నుంచి రూ.6 వేలకు పైగా వసూలు చేస్తున్నట్లు స్వయంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు భగ్గుమన్నారు. అతడిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ ఉద్యోగులకు కీలక బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. అధికారుల పరిశీలనలో ఆరోపణలు నిజమని నిగ్గుతేలినా చర్యలు తీసుకుంటే బయటికి బద్నాం అయితామన్న ఉద్దేశంతో చర్యలకు మిన్నకుండిపోయారు. అవినీతి ఆరోపణలున్నా అతడిపై కొందరు ఉన్నతాధికారులు ఎందుకంత ప్రేమ చూపుతున్నారని ప్రజాప్రతినిధులు, మున్సిపల్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

పారిశుద్ధ్య విభాగంలో..

పారిశుద్ధ్య విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు కీలక బాధ్యతలు కట్టబెట్టారు. ఉద్యోగ కోడ్ రీత్యా ఖాకీ ప్యాంటు, తెల్ల చొక్కాతో ఉండాల్సిన సదరు ఉద్యోగి యునిఫాం కూడా వేసుకోకుండా సివిల్ దుస్తులు, ఖద్దరు చొక్కాలు వేసుకుని ప్రభుత్వ ఉద్యోగులపై సైతం అజమాయిషీ చెలాయిస్తున్నాడు. ఇతడి వైఖరి భరించలేని సామాజిక కార్యకర్తలు, సమాచార హక్కు కార్యకర్తలు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో పాటు సంబంధిత ఉద్యోగి వివరాలు కోరినా అధికారులు మాత్రం వెల్లడించడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులపైనే పెత్తనం చెలాస్తున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనక మతలబేమిటో అర్థం కావడం లేదు..టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్‌తో పాటు పలు విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల తీరుపై అనేక ఆరోపణలున్నా అధికారులు వారిని వెనకేసుకోస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతంలోనూ అనేకం..

గతంలో ముస్సిపాలిటీలో పనిచేసిన ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మున్సిపల్ కమిషనర్ డిజిటల్ కీతో జీవో 111లో సైతం దాదాపు ముప్పెక్కి పైగా అనుమతులు జారీ చేశాడు. ఆ తర్వాత తెరుకున్న సదరు ఉన్నతాధికారి అతపై ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి అనమతులు రద్దు చేశాడు. అదే విధంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగితో పాటు ఓ ప్రభుత్వాధికారి, తపాలా కార్యాలయం అధికారి కలిసి చనిపోయిన వారి పేరును కొనసాగిస్తూ భారీ మొత్తంలో పింఛన్లు నొక్కేశారు. దీనిపై నామ మాత్రం విచారణ చేపట్టి పక్కన పడేశారు.

సరిపడా ఉద్యోగులున్నా..

రెవెన్యూ తదితర విభాగాల నుంచి వచ్చిన ఉద్యోగులున్నా నేటికి కీలక బాధ్యతలు తమకు అనుకూలమైన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కట్టబెట్టడంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయని ప్రజాప్రతినిధులు, పట్టణ పౌరులు చర్చించుకుంటున్నారు. ముస్సిపాలిటీలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీతో పాటు టౌన్‌ప్లానింగ్ విభాగాలు పూర్తి అవినీతి మయంగా మారాయని ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి

ముస్సిపాలిటీలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. పట్టణ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఉద్యోగులపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోరు. శంషాబాద్ ముస్సిపాలిటీలో పౌరసేవలకు తీవ్ర జాప్యం జరుగుతుంది. కొన్ని విభాగాలు అవినీతిమయంగా మారాయి.

– అక్రమ్‌ఖాన్– శంషాబాద్

విచారణ చేపడుతున్నాం..

ఆరోపణలు వచ్చిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై చర్యలు తీసుకుంటాం. వారిని కీలక బాధ్యతల నుంచి తొలగించి ప్రభుత్వ ఉద్యోగుల చేతికే ఇస్తున్నాం. ఆరోపణలపై విచారణ చేపడుతున్నాం. డిజిటల్ కీ నా వద్దనే ఉంది. అన్ని రకాలుగా పరిశీలించిన తర్వాతే జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేశాం. అవినీతికి అవకాశం లేకుండా పౌరసేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– బి. సుమన్‌రావు శంషాబాద్ మున్సిపల్ కమిషనర్

ఎండైనా.. వానైనా.. ఉంటుంది రక్షణ



టాప్‌తో దూసుకెళ్తున్న బైక్

మొయినాబాద్: నిన్నమొన్నటి వరకు ఎండలు మండిపోయాయి. ఇప్పుడు వానలు పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ద్విచక్రవాహనంపై పయనించే వారికి ఇబ్బందే.. ఈ నేపథ్యంలో వాటి నుంచి రక్షణ పొందేందుకు వాహనదారులు బైక్‌లకు ఇప్పుడు ఇలా టాప్ ఏర్పాటు చేసుకుంటున్నారు. రక్షణ గొడుకు కింద మొయినాబాద్ వైపు నుంచి నగరం వైపు దూసుకెళ్తున్న బైక్‌ను మృగవని పార్కు సమీపాన 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

'బండి'ని కలిసిన జిల్లా అధికార ప్రతినిధి



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవి

శంకర్‌పల్లి: కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి తొండ రవి సోమవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని మంత్రి దృష్టికి తెచ్చారు. అదే విధంగా ఒక సారి నియోజకవర్గంలో పర్యటించాలని కోరగా.. దీనికి మంత్రి సుముఖత వ్యక్తం చేసినట్లు రవి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం: భవనంపై నుంచి పడి తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం మృతిచెందారు. ఎస్ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. మంచాల మండలం నోముల గ్రామానికి చెందిన ఎం.రాములు(56) పట్నం ఠాణా పరిధి ఖానాపూర్ గ్రామ సమీపంలో జేబీ వెంచర్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గత నెల 28న నైట్ డ్యూటీ చేస్తుండగా.. నిర్మాణంలో ఉన్న క్లబ్ హౌస్ భవనం పై నుంచి పడి తీవ్రగాయాలపాలయ్యాడు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనపై విచారణ జరిపి, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి..

కడ్తాల్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై గోవిందాయిపల్లి తండా గేట్ వద్ద చోటు చేసుకుంది. సీఐ శివ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు(45) సంవత్సరాల వయసు గల వ్యక్తి ఆదివారం రాత్రి గేట్ వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా.. ఓ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సదరు వ్యక్తి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. ప్రమాద వివరాలపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 8333993536, 9493628100 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

సినిమా చూసి వస్తుండగా ఒకరు..

రాజేంద్రనగర్: అర్ధరాత్రి సినిమా చూసి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి ప్రగతి కాలనీకి చెందిన సాయి గణేశ్ (25) జల్‌పల్లిలో ప్లాస్టిక్ కంపెనీని నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి 2.30 గంటల ప్రాంతంలో నగరంలోని ఓ థియేటర్‌లో సినిమా చూసి తన జీపులో ఇంటికి బయలుదేరాడు. పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ 296 వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారు నాలుగు పల్టీలు కొట్టి ఎక్స్‌ప్రెస్ వే రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. ఈ సంఘటనలో కారు పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. కారు నడుపుతున్న సాయి గణేష్ తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎక్స్‌ప్రెస్‌వేపై ఈ సంఘటన చోటు చేసుకోవడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు, రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. వాహనాన్ని రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలి

బడంగ్‌పేట్: కార్పొరేషన పరిధిలోని అక్రమంగా వెలుస్తున్న నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని బీజేవైఎం కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కమిషనర్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం మాట్లాడారు. బడంగ్‌పేట 23వ డివిజన్‌లో కాలనీ అవసరాల కోసం వదిలిపెట్టిన ఓపెన్ ప్లాట్లు, పార్కుల్లో అక్రమ నిర్మాణాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వెంటనే నిర్మాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు.

యువతిపై లైంగిక దాడి

అమీర్‌పేట: వరుడిని వెతుకుతున్న యువతిపై జీవన్ సాథీ యాప్ ద్వారా పరిచయమైన ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు.ఈ సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది.పోలీసులు తెలిపిన మేరకు.. ఉప్పల్ ప్రాంతానికి చెందిన 27 ఏళ్ల యువతి జీవన్ సాథీ యాప్‌లో శోధిస్తుండగా ఎస్ఆర్‌నగర్ పరిధిలోని జయప్రకాష్‌నగర్‌లో ఫోటో స్టూడియో నిర్వహిస్తున్న ముత్తమ్మల రాజశేఖర్ పరిచయం అయ్యాడు. తాను ఫోటో గ్రాఫర్‌గా పనిచేస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి పరిచయం పెంచుకున్నాడు. యువతికి చెందిన ఈమెయిల్ ఐడీనికి కూడా వినియోగించేవాడు. గత నెల 24న యువతికి ఫోన్ చేసి స్టూడియోకు రమ్మని చెప్పాడు. మరుసటి రోజు స్టూడియోకు వెళ్లిన యువతిని బెదిరించాడు. తాను చెప్పినట్లు వినకపోతే మెయిల్ ద్వారా లభ్యమైన ఫోటోలను అందరికీ పంపి పరువు తీస్తానని భయపెట్టి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం ఎవరికైనా చెపితే చంపేస్తానని బెదిరించాడు. బాధితురాలు అక్కడి నుండి బయటపడి దగ్గరి బంధువైన మహిళకు తెలిపింది. అనంతరం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఎస్ఆర్‌నగర్‌కు బదిలీ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

'పీవీ' పురస్కారం అందుకున్న టీచర్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం పీర్జాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు కీర్తి పీవీ నర్సింహరావు జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. పీవీ జయంతిని పురస్కరించుకొని 'తెలుగు వెలుగు సాహితి' వేదిక ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ పట్టణంలోని ఫిలిం భవన్‌లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో 'ఈశ్వర పరమేశ్వర' గేయంపై నృత్య ప్రదర్శన చేసి ఆమె అందరి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా నిర్వాహకులు టీచర్‌కు పురస్కారం అందజేశారు.

నూతన కమిటీ నియామకం

షాద్‌నగర్‌రూరల్: శ్రీవాణి సాంస్కృతిక సంస్థ రాష్ట్ర నూతన కమిటీని సోమవారం పట్టణంలోని సంస్థ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడిగా వీహెచ్‌పీ తెలుగు రాష్ట్రాల క్షేత్ర ప్రముఖ్ బండారి రమేష్, ప్రధాన కార్యదర్శిగా కేఎల్ఎన్.కన్నా, కోశాధికారిగా గోపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా యాదగిరిచారిని నియమించారు. అదే విధంగా సంస్థ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా వెంకటేశ్, మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్‌గా ఆంజనేయులు, కో కన్వీనర్లుగా డాక్టర్ రాములు, కృష్ణారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్‌గా మనోహర్‌రావు, కో కన్వీనర్‌గా సతీష్, వికారాబాద్ జిల్లా కన్వీనర్‌గా వెంకటేశంను నియమించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కుమార్, పరంధాములుగౌడ్, విద్యాసాగర్‌రెడ్డి, గౌరీశంకర్, సురేందర్, బాలకృష్ణ, రఘురాంచారి, పవన్‌కుమార్, విద్యాసాగర్‌రెడ్డి, ఇస్తారయ్య తదితరులు పాల్గొన్నారు.




రమేష్ దంపతులను సన్మానిస్తున్న సంస్థ సభ్యులు

స్నేహితుడిని కత్తితో పొడిచి పరార్

అత్తాపూర్: పాన్ షాపు వద్ద పాన్ కొనుగోలు విషయమై ఇద్దరు స్నేహితుల మధ్య వివాదం చోటు చేసుకొని హత్యాయత్నానికి దారి తీసింది. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన మేరకు.. సులేమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ రఫీ (28), అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ నబీ (40) ఇద్దరూ స్నేహితులు. సోమవారం పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే ప్రాంతంలోని పాన్ షాపు వద్దకు వచ్చి పాన్ కొనుగోలు విషయమై ఘర్షణ పడ్డారు. దీంతో ఆవేశం పట్టలేని మహ్మద్ రఫీ తన వద్ద ఉన్న కత్తితో మహ్మద్ నబీపై దాడి చేసి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న అత్తాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన నబీని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం

పోలీసుల అదుపులో నిందితులు



మృతుడు సయ్యద్ హిదాయత్ ఆలీ(ఫైల్)

మణికొండ: గతంలో ఉన్న వివాహేతర సంబంధాన్ని తిరిగి కొనసాగించాలని కోరిన వ్యక్తిని ఓ మహిళ తన ప్రియుడితో కలిసి హత్యచేసింది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి సోమవారం తెలిపిన మేరకు.. గోల్కొండ చోటా బజార్‌లో ఉంటున్న సయ్యద్ హిదాయత్ ఆలీ(31) సివిల్ ఇంజనీర్‌గా పనిచేసేందుకు రెండు సంవత్సరాల క్రితం దుబయ్‌కు వెళ్లాడు. అంతకు ముందు అతనికి అదే ప్రాంతంలో ఉంటున్న సీమా బేగం(24)తో వివాహేతర సంబంధం ఉంది. సయ్యద్ హిదాయత్ ఆలీ దుబయ్‌కు వెళ్లిన తరువాత సీమా బేగం ఫలక్‌నామాలోని తీగలకుంటకు చెందిన సయ్యద్ అమీర్ (29)తో వివాహేతర సంబంధం ఏర్పరచుకుంది. అయితే దుబాయ్‌నుంచి ఇటీవల తిరిగి వచ్చిన హిదాయత్ ఆలీ తిరిగి వచ్చాడు. ఆమెను కలిసి తిరిగి తనతో వివాహేతర సంబంధం కొనసాగించాలని ఒత్తిడి చేశాడు. ఈ విషయం సీమబేగం అమీర్‌కు తెలిపింది.

చంపాలనే పథకం వేసి...

దీంతో ఇద్దరూ కలిసి హిదాయత్ ఆలీని చంపాలని నిర్ణయించుకున్నారు. అతనితో మంచిగా మాట్లాడి బయటకు తీసుకుని రావాలని సీమబేగంకు తెలిపాడు. దీంతో సీమా బేగం జూన్ 29వ తేదీన హిదాయత్ ఆలీతో కలిసి అతని క్వాలీస్ వాహనంలోనే ముందుగా వేసుకున్న పథకం ప్రకారాం నిర్మానుష్యంగా ఉండే మంచిరేవుల గ్రీన్ ల్యాండ్ కాలనీ వైపు తీసుకుని వచ్చింది. వారిని అనుసరిస్తూ బైక్‌పై వచ్చిన సయ్యద్ అమీర్ అక్కడకు వచ్చి హిదాయత్ ఆలీతో గొడవకు దిగాడు. ఓ ప్రహరీ పక్కకు తీసుకుని వెళ్లి కత్తితో పలుమార్లు విచక్షణారహితంగా పొడవటంతో తీవ్ర రక్తస్రావం జరిగి అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఇద్దరు నిందితులు బైక్‌పై అక్కడినుంచి పరారయ్యారు.

ఐడీ ప్రూఫ్ ఆధారంగా విచారణ...

మృతుడి జేబులో ఉన్న గుర్తింపు కార్డు ఆధారంగా అతని ఇంటికి వెళ్లి విచారణ చేయటం, స్థానికంగా ఇద్దరు వ్యక్తులు, ఓ బురఖా వేసుకున్న మహిళ మధ్య అక్కడ గొడవ జరిగిందనే విషయం తెలుసుకున్న పోలీసులు ఆ దిశగా విచారణ మొదలు పెట్టారు. మృతుని చిరునామాకు వెళ్లి విచారణ చేయగా గతంలో సీమాబేగంతో ఉన్న వివాహేతర సంబంధం తెలిసింది. ఆకోణంలో విచారణ చేయగా ఆమెతో పాటు సయ్యద్ అమీర్‌ను ఆదివారం రాత్రి షాహీన్‌నగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు నేరం అంగకరించారు. దాంతో నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గంజాయి కలిగి ఉన్న వ్యక్తుల పట్టివేత

యాచారం: ఇద్దరి వ్యక్తుల వద్ద అక్రమంగా దాచి ఉంచిన గంజాయిని యాచారం పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మంచాల మండల కేంద్రానికి చెందిన బండారి శివ, మండలంలోని గాండ్లగూడెం గ్రామానికి చెందిన కోరె ఉదయకిరణ్‌ల వద్ద గంజాయి ఉన్నట్లు పక్కా సమాచారంతో సోమవారం రాత్రి గ్రామంలో తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ గోపాల్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.